ప్రజాశక్తి
బుధవారం 29 జనవరి 2025 8 పేజీలు
ప్రకాశం బాపట్ల

బీమా చేయించి..
చెల్లిని చంపేసి..

- కారు ప్రమాదంగా చిత్రీకరించేందుకు యత్నించిన నిందితుడు
- పోస్టుమార్టం రిపోర్టును మార్చేందుకు లంచం ఇచ్చిన వైనం
- పొదిలి సిఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు
- ఎట్టకేలకు నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

నిందితుడు అశోక్‌కుమార్, సంధ్య (ఫైల్)

ప్రజాశక్తి-పొదిలి

రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో దివాలా తీసి అప్పులపాలైన వ్యక్తి.. ఎలాగైనా ఆర్థిక కష్టాల నుంచి బయటపడాలని ప్లాన్ వేశాడు. విడాకులు తీసుకొని ఇంట్లోనే ఉంటున్న చెల్లెలి పేరుతో బీమా కట్టాడు. చెల్లిని హాస్పిటల్‌కు తీసుకెళ్లే

వివరాలు వెల్లడిస్తున్న సిఐ వెంకటేశ్వర్లు

కారణంతో కారులో ఎక్కించుకొని మత్తు మాత్రలు ఇచ్చి.. స్పృహ కోల్పోయిన అనంతరం ఆమెకు ఊపిరాడకుండా చేసి.. చంపేశాడు. అనంతరం కారును చెట్టుకు ఢీకొట్టి యాక్సిడెంట్‌గా చిత్రీకరించాడు. లంచం ఇచ్చి.. పోస్టుమార్టం రిపోర్టులను మార్పించాడు. పొదిలి పోలీసులు చేపట్టిన ప్రత్యేక దర్యాప్తులో దొరికిపోయాడు. పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

పొదిలి సిఐ వెంకటేశ్వర్లు ▶ 2లో

డిఆర్‌సిలో మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి, పాల్గొన్న మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్

జిల్లా అభివృద్ధికి
ప్రత్యేక చొరవ తీసుకోవాలి

- స్వర్ణాంధ్రప్రదేశ్-2047 లక్ష్యాల సాధనకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి
- డిఆర్‌సిలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా జిల్లాను అభివృద్ధి చేయడానికి అధికారులంతా ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. సమావేశానికి వచ్చిన మంత్రులకు జిల్లా కలెక్టర్ వెంకట మురళి ఘనంగా ఆహ్వానం పలికారు. సమావేశానంతరం ముగ్గురు మంత్రులు డిఆర్సి సమావేశంపై సంక్షిప్తంగా మీడియాతో మాట్లాడారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పార్థసారధి మాట్లాడుతూ స్వర్ణాంధ్రప్రదేశ్-2047 నిర్దేశించిన లక్ష్యాలు సాధించడానికి అధికారులు మరింత చిత్తశుద్ధితో పనిచేయాలని తెలిపారు. ప్రభుత్వ ఆలోచనలను ప్రజల వద్దకు తీసుకువెళ్లే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజల ఇబ్బందులు తొలగించడానికి గుంతల రహిత రహదారుల కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ప్రజల సుఖమైన ప్రయాణం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మరమ్మతు పనులలో గుత్తే దారులు నాణ్యత పాటించకపోతే ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ▶ 2లో

చిరు వ్యాపారులపై దౌర్జన్యం

- కూరగాయల మార్కెట్‌లో తాత్కాలిక దుకాణాల అక్రమ తొలగింపు
- సమయం ఇవ్వాలని ప్రాధేయపడినా కనికరించని అధికారులు, పోలీసులు
- నిరసనగా కలెక్టరేట్‌ను ముట్టడించిన చిరు వ్యాపారులు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

దామోదరం సంజీవయ్య కూరగాయల మార్కెట్లో చిరువ్యాపారులపై నగరపాలక సంస్థ అధికారులు, పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించారు. వారు ఏర్పాటుచేసిన తాత్కాలిక దుకాణాలను అక్రమంగా తొలగించారు. మంగళవారం నాడు ఉదయం 6 గంటల నుంచి నగర పాలక సంస్థ అధికారులు, 50 మంది సిబ్బంది పోలీస్ బందోబస్తుతో ఆకస్మికంగా మార్కెట్‌లోని చిరు వ్యాపారులు నిర్వహిస్తున్న తాత్కాలిక షాపుల తొలగింపు ప్రక్రియను మొదలుపెట్టారు. చిల్లర వర్తకులు తాము తెచ్చుకున్న కూరగాయలు, ఇతర సామగ్రిని తీసుకుని ఖాళీ చేసేందుకు ఏమాత్రం సమయం ఇవ్వకుండా కర్కశంగా వ్యవహరించారు. మారుబేరానికి పచ్చి సరుకు తెచ్చుకున్నామని, నష్టపోతామని, కొంత సమయం ఇవ్వాలని ప్రాధేయపడినా కనికరించలేదు. తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న దుకాణాలను అక్రమంగా తొలగించారు. కూరగాయలు,

తాత్కాలిక షాపులను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఇతర సరుకులను చిందరవందర చేశారు. దీంతో చిరు వ్యాపారులు రోడ్డున పడ్డారు. చిరు వ్యాపారులంతా ప్రదర్శనగా మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ట్రంక్ రోడ్డు మీదగా ప్రకాశం భవనం చేరుకొని కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ ముట్టడి కార్యక్రమానికి సంఘీభావంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు, పట్టణ పౌర సంఘాల సమాఖ్య నగర నాయకులు జి రమేష్, తంబి శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ నాయకులు మాట్లాడారు. 16 సంవత్సరాల క్రితం పాత మార్కెట్ లో ఉన్న వ్యాపారస్తులను కొత్త మార్కెట్‌కు తరలించి వేలం పద్ధతిలో షాపులు కేటాయించారని పేర్కొన్నారు. నాలుగు సంవత్సరాల క్రితం కరోనా వల్ల వ్యాపారాలు ▶ 2లో

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న చిరు వ్యాపారులు

పాలన..నత్తనడకన..

- వేగంగానే కలెక్టర్ నిర్ణయాలు..
- మిగతా యంత్రాంగంలో తీవ్ర నిర్లిప్తత
- పాలనపై మంత్రి సహా ప్రజాప్రతినిధుల్లోనూ అసంతృప్తి

స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఒక వైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నందున సం క్షేమ ఎజెండా ఇంకా ఊపందుకోలేదు. సూపర్ సిక్స్ పథకాలు పూర్తిస్థాయిలో గ్రౌండింగు కాలేదు. అందరిలోనూ ఎదురుచూపులే మిగి లాయి. జిల్లాలో పాలనలోనూ నిర్లిప్తత కొన సాగుతోంది. ఇంకా చెప్పాలంటే పాలన నత్తనడకన సాగుతోంది. ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టుగా లేదనే చర్చ సాగుతోంది. రాజకీయ సమన్వయ లోపమా? లేక యంత్రాంగం ఉదాసీనతా? ఏదేమైనా పాలన వేగం అందు కోలేదు. ఎక్కడో లోపం కనిపిస్తోంది. యంత్రాంగం మొత్తం ఈ కాలంలో మారిపోయింది. కొత్త పాలనపై పట్టు రాలేదు. సమీక్షలు నడుస్తున్నాయి. ప్రజాప్రతినిధులూ సమస్య లపై స్పందించి యంత్రాంగానికి పురమా యిస్తున్నారు. పరిష్కారాలు కావడం లేదనే చర్చ నడుస్తోంది. ఏ పనులూ వేగంగా జర గడం లేదంటున్నారు. ప్రజాప్రతినిధులకు, యంత్రాంగానికి ఇంకా సెట్ కాలేదా? సమన్వయం పూర్తిస్థాయిలో లేదా? అన్నదే ఇప్పుడు సందేహంగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చాక జడ్పీ, డిఆర్‌సీ సమావేశాలు జరిగాయి. జిల్లా అభివృద్ధి పేరుతో సమీక్షలు జరుగుతున్నాయి. మంత్రి డోలాశ్రీ బాల వీరాంజనేయస్వామి కూడా పలు సమీక్షలు నిర్వహించారు. క్షేత్ర స్థాయి యంత్రాంగంలోనూ అలసత్వం ఉందనే చర్చ సాగుతోంది. మొన్న జరిగిన సమీక్ష లోనూ సీనియర్ ప్రజాప్రతినిధి మండలస్థాయి అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ వారిపై చర్య తీసుకోవాలని కోరారు. అంటే మండల స్థాయి అధికారుల్లో నిర్లిప్తత ఏ స్థాయిలో ఉందో విదితమవుతోంది. పాలన విషయానికి వస్తే కలెక్టర్ అన్సారియా వేగంగానే నిర్ణయాలు తీసుకుంటున్నారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. తనిఖీలు చేస్తున్నారు. తనదైన శైలిలో ముందుకు పోతున్నారు.అ యితే కలెక్టర్ తర్వాత అధికారులు ఎవరూ క్రియాశీలకంగా లేరనే భావనలో మంత్రి డోలా సహా ప్రజా ప్రతినిధులు అందరూ ఉన్నారు. జేసీ కూడా క్రియాశీలకంగా లేరనే చర్చ ప్రజాప్రతినిధుల మధ్య సాగుతోంది. కీలక అధికారుల మధ్య సమన్వయం కూడా సక్రమంగా లేదనే చర్చ సాగుతోంది. ముగ్గురు ఆర్డీవోలు కూడా వేగంగా లేరనే చర్చ నడుస్తోంది. మండల స్థాయిలో చాలామంది ఎంపీడీఓలు నిర్లక్ష్యంగా ఉన్నారని చెబుతున్నారు. ఏదైనా ▶ 2లో

రూ.200 కోట్లతో స్టేడియం: మంత్రి

ప్రజాశక్తి-టంగుటూరు

విశాఖలో వికలాంగుల కోసం రూ.200 కోట్లతో 20 ఎకరాల్లో స్టేడియం నిర్మిస్తున్నట్లు రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. మంగళవారం రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, పలువురు విభిన్న ప్రతిభావంతులు వెలగపూడి సచివాలయంలో మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామిని కలిసి 7వ రాష్ట్ర పారా అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ 2025 పోటీలకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా మంత్రి వారితో మాట్లాడుతూ, దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. వికలాంగ విద్యార్థులకు ఉచితంగా ల్యాప్ టాప్‌లు, ఫోన్‌లు, త్రీ వీలర్స్ ఇస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగుల పింఛను రూ.6 వేలకు పెంచాం. మంచానికే పరిమితమైన వారికి నెలకు రూ.15,000 ఇస్తున్నామన్నారు. దివ్యాంగ విద్యార్థులకు పింఛన్ ప్రతి నెల వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజ నేయస్వామి అన్నారు.



మంత్రి స్వామికి వినతిపత్రం ఇస్తున్న రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్

సిపిఎం సభలను జయప్రదం చేయండి

శింగరాయకొండ: ఫిబ్రవరి 1, 2, తేదీల్లో నెల్లూరులో జరుగు సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ టంగుటూరి రాము పిలుపునిచ్చారు.

రిజిస్ట్రేషన్ లింకు డాక్యుమెంట్లు పోయినవి

యర్రగొండపాలెం పట్టణానికి చెందిన బంటు దీనా జవహర్‌కి సంబంధించి పల్నాడు జిల్లా నరసరావుపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ కాబడిన 1.864/2009, 2.865/2009, 3.14829/2009 నెంబర్లు గల డాక్యుమెంట్లకు సంబంధించిన లింక్ డాక్యుమెంట్లు ఈనెల 25వ తేదీన ఇంటి నుంచి జిరాక్స్ తీయించుకునేందుకు జిరాక్స్ సెంటర్‌కు తీసుకెళుతుండగా బ్యాగులో నుంచి జారి కింద పడి పోయినవి. ఆలింకు డాక్యుమెంట్లు ఎంత వెతికినా దొరకలేదు. ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియ జేయగలరు.

ఇట్లు
బంటు దీనా జవహర్
మార్కాపురం రోడ్డు
యర్రగొండపాలెం, ప్రకాశం జిల్లా
సెల్ నెంబర్ : 9848670103

ఆటో డ్రైవర్లు హద్దు మీరితే చర్యలు: ఎస్ఐ

ప్రజాశక్తి-పొన్నలూరు

స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఎస్ఐ అనుక్ ద్విచక్ర, ఆటో, ట్రాక్టర్ వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మండలంలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని వాహనాలు నడిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రయాణికులు, రైతు కూలీలతో మాట్లాడుతూ మీ కుటుంబం గురించి కూడా మీరు ఆలోచించి, ఆటోలలో ఎక్కేటప్పుడు సరిపడా ఖాళీ ఉంటే ఎక్కాలని వారికి సూచించారు. ద్విచక్ర వాహనంపై వెళ్ళేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేకుంటే చర్యలు తప్పవని అన్నారు. ట్రాక్టర్లు నడిపే డ్రైవర్లు ట్రక్కులలో పరిమితి లోపలే లోడ్ చేసుకోవాలని అలాగే రాత్రి సమయాలలో కట్టెల లోడుతో వెళుతున్న ట్రాక్టర్ డ్రైవర్లు ఎదుటి వచ్చే వాహనదారులకు డిప్ కొట్టి వెనక భాగాన లైట్లు అమర్చుకోవాలని వారికి తెలియపరిచారు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S No : 28/2024
కానాల పుల్లారావు .. వాది
యెదురి
కోయలకుంట్ల రంగాచారి .. ప్రతివాది
To
ప్రతివాది చిరునామా
కోయలకుంట్ల రంగాచారి తండ్రి శంకరయ్య, వెంకటాపురం గ్రామం, గిద్దలూరు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబర్ దావాలో మీపై దావా పరిహారం కొరకు దావా దాఖలు చేసి యున్నందున, మీకు సమను నిమిత్తము 30-01-2025 తేదికి వాయిదా వేసియున్నారు. కనుక తేదీ 30-01-2025 ఉదయం 10:30 గంటలకు మీరు స్వయముగా కానీ, మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టులో సంజాయిషీ చెప్పుకోవలసియున్నది. లేని యెడల మీ పరోక్షమందు దావాను విమర్శించి తీర్మానించ బడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
దావా తేదీ: 30-01-2025 ఇట్లు
కాకునూరి హిమశేఖరరెడ్డి,
వాది పరం న్యాయవాది,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.

చిరువ్యాపారులపై దౌర్జన్యం

(మొదటిపేజీ తరువాయి)

సక్రమంగా లేక అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో నగరపాలక సంస్థ ఎటువంటి కనికరం చూపకుండా అద్దెతో పాటు ధర్మవడ్డీ, చక్రవడ్డీల పేరుతో లక్షల రూపాయల అద్దెలు కట్టాలని డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. ఒకరికి షాపు అద్దె బకాయిలు రూ.3.90 లక్షలు కాగా, దానికి రూ.6 లక్షలు వడ్డీ వేశారని, మొత్తం రూ.10 లక్షలు కట్టాలని చెప్పి ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. ఇటువంటి చర్యల వల్ల వడ్డీలు చెల్లించలేక, అద్దె బకాయిలు చెల్లించలేక అప్పులపాలయ్యి వ్యాపారాలు వదులుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇదిలా ఉండగా షాప్ తీసుకున్న యజమాని మరణిస్తే, వారి వారసులు వ్యాపారం చేసుకుంటున్నారని, వారిని కూడా ఇదే రీతిగా కార్పొరేషన్ సిబ్బంది వేధిస్తున్నట్లు ఆరోపించారు. వడ్డీలుకు తెచ్చిన పెట్టుబడులతో ఇల్లు జరగక జీవిస్తున్న చిరు వ్యాపారులపై కార్పొరేషన్ యాజమాన్యం ఇటువంటి దౌర్జన్యకాండకు పాల్పడడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. మానవతా దక్పథంతో వడ్డీలు మాఫీ చేసి దఫాల వారీగా అద్దెలు చెల్లించేందుకు వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్ఓ ఓబులేసుకు వినతిపత్రం అందించారు. తరువాత ప్రదర్శనగా ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావుని కలిసి వినతి పత్రం అందించారు. రెండు రోజుల్లో సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ నాయకులు సునీల్, సురేష్, సుబ్బారెడ్డి, రామయ్య, బి.శ్రీను, బి.కోటిలింగారెడ్డి, వెంకటేశ్వరమ్మ, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

సమస్యలన్నీ పరిష్కరించాలన్నారు. గుంతలు పూడ్చే కార్యక్రమంలో జాప్యంపై పలువురు ప్రజాప్రతినిధులు ఆర్అండ్‌బి అధికారులను ప్రశ్నించారు. దీంతో సి ఆర్ ఎఫ్, ఎండిఆర్ఎఫ్ పెండింగ్ పనులపై ఆయన ఆరా తీశారు. నిధులు ఇస్తున్నప్పటికీ ఎందుకు పనిచేయడం లేదని నిలదీశారు. నేటికీ పనులు ప్రారంభించకపోతే రద్దు చేయాలని, నిబంధనలు విస్మరించిన గుత్తేదారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గుత్తేదారులు సరిగా చేయకపోతే ఇంజినీరింగ్ అధికారులు ఏం చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. అధికారులు శ్రద్ధతో పని చేస్తేనే పురోగతి ఉంటుందన్నారు.

ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు

అమృతధార పథకం కింద ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించే ప్రక్రియ త్వరలో చేపడతామని జిల్లా ఇంచార్జి మంత్రి పార్థసారథి తెలిపారు. లే అవుట్ లలో తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. గతంలో జల జీవన్ మిషన్ పనులు వేగంగా చేపట్టకపోవడంతో నిధులు మురిగిపోయాయన్నారు. ఆ నిధులను అమతధార పథకం కింద తెప్పించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుందన్నారు. కేంద్రానికి ప్రతిపాదనలు పంపామన్నారు. సాగునీటి కాల్వల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాల్వలలో తూటికాడ తొలగించాలని, మరమ్మతు పనులు వేగంగా చేపట్టాలన్నారు. పిఎంఎవై కింద మంజూరు చేసిన గహాలు డిసెంబర్ లోగా నిర్మాణాలు పూర్తి చేయాలని తెలిపారు. కేంద్రం ఇచ్చిన గడువులోగా నిర్మాణాలు చేయలేకపోతే నిధులు మురిగిపోతాయన్నారు. వందరోజుల పని దినాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రూ.110 కోట్లతో బాపట్లలో ఉపాధి పనులు జరుగుతుండగా, రూ.31 కోట్ల పనులు మిగలడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఆయా లేఅవుట్‌లలో నిర్మాణం పూర్తిచేసిన గహాలను ఫిబ్రవరి ఒకటో తేదీన ప్రారంభించాలని మంత్రి చెప్పారు. ఉచిత ఇసుక విధానాన్ని బాపట్ల జిల్లాలో సమర్థంగా నిర్వహించడంపై అధికారులను మంత్రి అభినందించారు. ఇసుక తవ్వకాలు, విక్రయాల వద్ద ఎలాంటి సమస్యలు రానివ్వకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

సూర్యలంక, చీరాల బీచ్ అభివద్ధికి ప్రతిపాదనలు

సూర్యలంక, చీరాల బీచ్‌ల అభివద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తే రాష్ట్ర ముఖ్యమంత్రి దష్టికి తీసుకువెళ్తామని మంత్రి పార్థసారథి చెప్పారు. సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ.97 కోట్లతో డిపిఆర్ సిద్ధం చేసి కేంద్రానికి నివేదించామన్నారు. సర్వీస్ సెక్టార్లు పెరిగితే ఉపాధి అవకాశాలు, ఆదాయం వద్ధి అవుతోందన్నారు. ఇందుకోసం రానున్న బడ్జెట్లో నిధులు కేటాయించేలా సీఎం దష్టికి తీసుకువెళ్తామన్నారు.

బాపట్ల జిల్లాలో 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, మరో ఏడు వేల మెట్రిక్ టన్నుల సేకరణకు ప్రభుత్వం తాజాగా అనుమతించిందని తెలిపారు. 24 గంటల్లోనే రైతులకు డబ్బులు చెల్లిస్తున్నామన్నారు. మరో 38 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రానుందని చెప్పారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దష్టికి తీసుకెళ్తామన్నారు.

ఈ సందర్భంగా విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడారు. సమావేశంలో గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ హెన్రీ క్రిస్టినా, జిల్లా ఎస్పీ తుషార్ డూడి, జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, అడిషనల్ ఎస్పి టిపి విఠలేశ్వర్, జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బీమా చేయించి..చెల్లిని చంపేసి..

(మొదటిపేజీ తరువాయి)

మంగళవారం నాడు విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం.. కలిగిరి మండలం, పునుగోడు గ్రామానికి చెందిన మాలపాటి అశోక్‌కుమార్, మాలపాటి సంధ్య (24) అన్నాచెల్లెళ్లు. అశోక్‌కుమార్ కుటుంబం కాటూరివారిపాలెంలో నివాసముంటోంది. సంధ్య వివాహమైనా గర్భ సంబంధిత వ్యాధితో ఇబ్బంది పడేది. పిల్లలు పుట్టకపోవడంతో భర్తతో ఏర్పడిన వివాదాల కారణంగా విడాకులు తీసుకొని.. కాటూరివారిపాలెంలో అన్న ఇంట్లోనే ఉంటోంది. అప్పటికే రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో దివాలా తీసి.. అప్పుల పాలైన అశోక్‌కుమార్ తను ఎలాగైనా అప్పుల నుంచి బయటపడాలనే దురుద్దేశంతో ఒక పథకం వేశాడు. చెల్లెలు సంధ్యపై వివిధ కంపెనీలలో సుమారు కోటి రూపాయల వరకు బీమా చేయించాడు. గత ఏడాది ఫిబ్రవరి 4న ఆమెను హాస్పిటల్‌కు తీసుకువెళ్లే నెపంతో ఒంగోలుకు తన కారులో తీసుకెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఆమెకు నిద్ర మాత్రలు ఇచ్చాడు. స్పహ లేకుండా నిద్రపోతున్న సమయంలో పొదిలి సమీపంలోని కాటూరివారిపాలెం వద్ద హెచ్‌పి పెట్రోల్ బంక్ సమీపంలో నిర్మానుష్య ప్రదేశంలోకి ఆమెను తీసుకెళ్లి.. ఆమెకు ఊపిరాడకుండా చేసి.. చంపేశాడు. ఆమె మరణాన్ని ప్రమాదంగా చిత్రీకరించేందుకు తన కారును ఒక చెట్టుకు ఢీకొట్టి.. యాక్సిడెంట్‌గా నమ్మించే ప్రయత్నం చేశాడు. తదుపరి పోస్టుమార్టం సమయంలో కూడా తన స్నేహితుడి ద్వారా ముద్దాయి మత్తు టాబ్లెట్ ఇచ్చిన విషయాన్నిరిపోర్టు నుండి తొలగించేందుకు పోస్టుమార్టం చేసే వ్యక్తికి రూ.3.50 లక్షలు ఇచ్చే విధంగా ఒప్పందం చేసుకున్నారు. అందులో భాగంగా పోస్టుమార్టం చేసిన వ్యక్తికి రూ.3 లక్షలు ఇచ్చారు. సంధ్య మృతిపై తండ్రి మాలపాటి తిరుపతయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేశారు. సంధ్య మృతిపై అనుమానాలు వ్యక్తం చేసిన పొదిలి పోలీసులు సిఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో లోతుగా దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో ఇన్సూరెన్స్ విషయం బయటపడింది. ఆ దిశగా పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టగా.. అశోక్‌కుమార్ బీమా డబ్బు కోసం చెల్లెలు సంధ్యను చంపినట్లు తేలింది. దీంతో పొదిలి పోలీసులు అశోక్‌కుమార్‌ను అరెస్టు చేశారు.

పాలన..నత్తనడకన..

(మొదటిపేజీ తరువాయి)

చెబితే వెంటనే పనులు జరగడంలేదంటున్నారు. ఎమ్మెల్యేల్లోనే ఈ విషయంలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. మంత్రుల నుంచి పదేపదే చెప్పిస్తున్నా కొన్ని పనులు ముందుకు సాగడం లేదంటున్నారు. అవినీతిపైనా ఎటువంటి మార్పు లేదంటున్నారు. గతానికీ, ఇప్పటికీ తేడా ఏముందనే ప్రశ్న తలెత్తుతోంది. కార్యాలయాలకు వెళ్లే వారి నుంచి ఎప్పటిలాగే వసూళ్ల పర్వం నడుస్తోంది. డబ్బు లేకుండా ఏ పనులూ కావడం లేదు. కార్యాలయాల్లో ఫైళ్లు కదలడం లేదు. ఇటీవల భూ సమస్యలపై 16 వేలకు పైగా నే అర్జీలు అందాయి. వాటిల్లో 80శాతం పైగా పెండింగు లోనే ఉంచారు. వెంటనే పరిష్కారం చేయాలనే ఆలోచన లేదు. దీంతో మళ్లీ సోమవారం నాడు ప్రజాదర్బారుకు అర్జీలు తీసుకొని వస్తున్నారు. మండలాల్లోనూ ఇదే పరిస్థితి. పాలనలో జవాబుదారీతనం ఎంతమేరకు అనేదీ ప్రశ్నార్థకం గానే మారింది. అధికారుల బదిలీల్లో జిల్లా నేతల పాత్ర కూడా ప్రశ్నార్థకంగానే ఉంది. అందరినీ నేరుగా రాష్ట్ర కేంద్రం నుంచి పరిశీలించి పోస్టింగులు వేశారు. దీంతో మొదటినుంచీ ప్రజాప్రతినిధులకూ, అధికారులకూ మధ్య గ్యాప్ నడుస్తోంది. నిర్ణయాలు వేగంగా లేవు. అర్జీలకు పరిష్కారం దొరకడం లేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు పెండింగులో ఉన్నాయి. మార్కాపురం జిల్లా ఏర్పాటు, వెలిగొండ నిర్వాసితులకు ప్యాకేజీలు, కనిగిరి, దొనకొండ పరిశ్రమ కేంద్రాలు వంటి భారీ పథకాలన్నీ అయోమయం గా ఉన్నాయి. ఏది చేయాలన్నా నిధుల్లేవనే చర్చ రావడంతో ఎమ్మెల్యేలు గందరగోళంగా ఉన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన అనేక హామీలకు ప్రతిపాదనలు తయారు చేయాల్సి ఉంది. వాటికి నిధులు రాబట్టే చర్యలు లేవు. మరోవైపు విజన్ 2047 పేరుతో అభివృద్ధి లక్ష్యాలకు గణాంకాలు తయారు చేశారు. వాటికి నిధులు, కార్యాచరణ ఏమిటనేదీ స్పష్టత లేదు. ఏదేమైనా పాలనలో వేగం పెరగాల్సి ఉంది.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No : 579/2023
బొంతా శ్రీనివాస రెడ్డి .. వాది
వర్సస్
ఈదుల విష్ణు వర్ధన్ రెడ్డి .. ప్రతివాది
To
ప్రతివాది చిరునామా
ఈదుల విష్ణు వర్ధన్ రెడ్డి తండ్రి బల రామిరెడ్డి, హిందూ, ప్రైవేట్ లెక్చరర్, వయస్సు 40 సం.లు, 2-81-ఏ, నరవ గ్రామం, గిద్దలూరు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలో వాది మీ నుండి పరిహారం రాగోరి పై నెంబరు దావా దాఖలు చేసినందున, సదరు దావాలో మీరు పైకోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుటకు తేదీ 31-01-2025న వాయిదా వుండినది. కావున మీరు ఆయా రోజున ఉదయం 10-30 నిమిషాలకు మీరు స్వయంగా కానీ, లేదా మీ వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై మీరు ఆక్షేపణలుంటే తెలుపు కునేది, లేనిచో మీ పరోక్షమందు సదరు దావాను విమర్శించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
గిద్దలూరు
తేదీ : 28-01-2025 ఇట్లు
శ్రీ పి.యస్.శేషశయనా రెడ్డి,
శ్రీ యం.రంగారెడ్డి,
వాది పరం అడ్వకేట్స్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా,
ఆంధ్రప్రదేశ్

మద్యం దుకాణాల్లో చోరీ

- రూ.5 లక్షల విలువైన మద్యం బాటిళ్లు, రూ.20 వేల నగదు అపహరణ

ప్రజాశక్తి-అద్దంకి

గుర్తుతెలియని వ్యక్తులు రెండు మద్యం దుకాణాల్లో చోరీకి పాల్పడ్డారు. సుమారు రూ.5 లక్షల విలువైన మద్యం బాటిళ్లు, రూ.50 వేల నగదు అపహరించారు. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.... గుర్తుతెలియని వ్యక్తులు తొలుత అద్దంకి మండల పరిధిలోని నాన్ ఎక్స్‌ప్రెస్ వే రోడ్డు సమీపంలోని శాంతినగర్‌లోని మారుతీ వైన్స్ దుకాణం వెనుక వైపు

గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టిన మద్యం దుకాణం రేకులు

ఇనుప రేకులు తొలగించి లోనికి ప్రవేశించారు. సుమారు రూ.4.50 లక్షల విలువైన మద్యం కేసులను అపహరించారు. అదే విధంగా సిసి కెమెరాల డిసిఆర్‌ను కూడా తీసుకెళ్లారు. అదేవిధంగా బల్లికురవ మండలం వైదన కొప్పెరపాడు సమీపంలోని అంకమ్మ తల్లి వైన్స్ దుకాణం తాళాలు పగులగొట్టి రూ.50 వేల విలువైన మద్యం బాటిళ్లు, రూ.20 వేల నగదును అహరించారు. చోరీని అడ్డుకోబోయిన వాచ్‌మెన్‌పై నిందితులు దాడి చేశారు. ఈ ఘటనలపై మద్యం దుకాణాల యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సిఐ ఆరాధ్యుల సుబ్బరాజు, ఎస్‌ఐ ఖాదర్ బాషా తమ సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి -బాపట్ల

విద్యార్థి దశ నుంచే బాలికలు గణతంత్ర దినోత్సవ ప్రాధాన్యతను తెలుసుకోవాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు తెలిపారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని భావపురి చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాపట్ల పట్టణంలోని గిరిజన బాలికల వసతి గహంలో భారత రాజ్యాంగం ఆవశ్యకతపై బాలికలకు బహుముఖ ప్రజ్ఞ అనే అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 1950 జనవరి 26న డాక్టర్ అంబేద్కర్ గాలి,నేల, కొండ, కోన, పల్లె,పట్టణాల్లో నివసించే ప్రజలు, మతాలు, కులాలు, ప్రాంతాలు, జాతులు, వివిధ భాషా సంస్కతులు కలిగి భిన్నత్వంలో ఏకత్వంతో జీవిస్తూ రాజ్యాంగ ఫలాలు ప్రజలకు సమానంగా అందాలని రాజ్యాంగంలో పేర్కొన్నట్లు తెలిపారు. లిఖితపూర్వకమైన రాజ్యాంగాన్ని డాక్టర్ అంబేద్కర్ భారతజాతికి అందించారన్నారు. రాజ్యాంగం ఎంత

బహుమతులు అందజేస్తున్న శ్రీనివాసరావు

మంచిదైనా దాన్ని అమలు చేసే వ్యక్తులు దురాలోచనతో, దుర్బుద్ధి కలగి ఉంటే ఎంతటి రాజ్యాంగమైనా పనికిరాకుండా పోతుందన్నారు. అందుకే లిఖిత పూర్వకమైన భారత లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నారు. రాజ్యాంగాన్ని అవమానించే సంస్థలు, వ్యక్తులు, సమూ హాలను ప్రజలు ఐక్యంగా ఎదుర్కోవాలన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో బాలికలందరూ ఉన్నత చదువులు చదివి దేశానికి మంచి పేరు తెచ్చే విధంగా కషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థినులకు రాజ్యాంగ పీఠికను చదివించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్, ఐద్వా నాయకురాలు టి. సుభాషిణి, సిఐటియు నాయకులు శరత్, హాస్టల్ వెల్ఫేర్ అధికారి ధనలక్ష్మి, పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-అద్దంకి

రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ, మండల న్యాయ సేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, జల సంరక్షణ, లింగ నిర్ధారణ పరీక్షలు, వినియోగదారుల హక్కుల పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు వీరయ్య మాట్లాడుతూ వినియోగదారుల పరిరక్షణ చట్టంలోని హక్కులు తెలుసుకొని మోసపోకుండా ప్రజలు జాగరూకతతో మెలగాలన్నారు. న్యాయవాది ప్రకాష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలన్నారు. పర్యావరణం సరిగా లేకపోతే మానవ మనుగడకే

మాట్లాడుతున్న సతీష్

ప్రమాదమన్నారు. మహమ్మద్ రఫీ మాట్లాడుతూ లింగనిర్ధారణ పరీక్షలు చేయడం చట్టప్రకారం నేరమన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, న్యాయ వాదులు ఎం ప్రకాష్, మార్త శ్రీనివాసరావు, షేక్ మహమ్మద్ రఫీ, రోటరీ సభ్యులు అళహరి హరి ప్రసాద్, పసుపులేటి ఆంజనేయులు, చిన్ని కామేశ్వరరావు, కష్ణ, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన ఉండాలి

డిటిఒ పరంధామరెడ్డి

ప్రజాశక్తి - చీరాల

యువత రోడ్డు ప్రమాదాల నివారణ పట్ల అవగాహన కలిగి ఉండాలని డిటిఒ టికె. పరంధామ రెడ్డి తెలిపారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా స్థానిక యార్లగడ్డ అన్నపూర్ణమ్మ ప్రభుత్వ మహిళా కళాశాలలో విద్యార్థినిలకు రహదరి భద్రతపై మంగళవారం అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిటిఒ మాట్లాడుతూ మాట్లాడుతూ యువత ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నట్లు తెలిపారు. రహదారి నిబంధనలు పాటించకపోవడమే అందుకు కారణమని తెలిపారు. విద్యార్థి దశ నుంచే రహదారి భద్రతపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు ప్రమాదానికి గురైతే తమ మంచి భవిష్యత్‌ను కోల్పోతారని తెలిపారు. రహదారిపై ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. చట్టాలు ఉన్నది ప్రజల రక్షణ కోసమే అని వాటిని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందన్నారు. చీరాల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి. రామ కష్ణా రెడ్డి మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెల్ ధరించాలన్నారు. నాలుగు చక్రాల వాహనాలు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపటం అత్యంత ప్రమాదకరమన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు

మాట్లాడుతున్న డిటిఒ పరంధామరెడ్డి

నడపడం చట్ట విరుద్ధమని తెలిపారు. ప్రమాదాల జరగడానికి పలు కారణాలను విద్యార్థులకు వివరించారు.ఎన్‌జిఒ రాజా సల్మాన్ వీడియో ప్రదర్శన ద్వారా ప్రమాదాలు జరగడానికి కారణాలు, హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ఉపయోగాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సదస్సులో కళాశాల వైస్ ప్రిన్సిపల్ జిపి. నీలాకుమారి, కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

వేమూరు : వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మోటార్ వైహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసన్నకుమారి తెలిపారు. వేమూరు నియోజక పరిధిలోని కొల్లూరు క్లబ్‌లో జాతీయ రహదారి భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే మీ ప్రాణాలతో పాటు ఎదుటివాడి ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అంకమ్మరావు, జిల్లా రోడ్ సేఫ్టీ డాక్టర్ సురేంద్ర కుమార్, కొల్లూరు ఎస్‌ఐ ఏడుకొండలు, లారీ యూనియన్ అధ్యక్షుడు సుధాకర్. పాల్గొన్నారు.

కొల్లూరు : స్థానిక ఎంప్లాయీస్ క్రియేషన్ క్లబ్‌లో 36వ జాతీయ రహదారి భద్రతా మాత్సోవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ ప్రసన్నకుమారి, అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ అంకమ్మరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసన్న కుమారి మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యంతో అత్యంత విలువైన ప్రాణాన్ని పోగొట్టుకో రాదని తెలిపారు. అంకమ్మరావు మాట్లాడుతూ వాహన చోదకులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. ఎస్‌ఐ ఏడుకొండలు మాట్లాడుతూ ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు అక్కడ ఉన్న వ్యక్తి వెంటనే హాస్పటల్ కి జాయిన్ చేస్తే వారి మీద ఎలాంటి కేసులు ఉండవని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నరేంద్ర కొల్లూరు, లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుధాకర్, వాహన చోదకులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- టంగుటూరు

బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరి తీవ్ర గాయాలయ్యాయి.ఈ ఘటన జరుగుమల్లి మండల పరిధిలోని చిరికూరపాడు గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో శింగరాయకొండ మండలం శానంపూడి గ్రామానికి చెందిన బింగినపల్లి శ్రీనివాసులు, బింగినపల్లి కొండయ్య గాయపడ్డారు. క్షతగాత్రులు నర్సింగోలు గ్రామంలో ఓ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం బైకుపై తమ స్వగ్రామానికి బయలు దేరాడు. చిరికూరపాడు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న బైకు ఢీకొంది. దీంతో శ్రీనివాసులు, కొండయ్యకు తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న సచివాలయ ఆరోగ్య సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - మద్దిపాడు

ముందు వెళ్తున లారీని బైకు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని గుండ్లాపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై మంగళవారం చోటు చేసుకుంది. మద్దిపాడు ఎస్‌ఐ శివరామయ్య తెలిపిన వివరాల ప్రకారం... పంగులూరు మండలం తక్కెలపాడు గ్రామానికి చెందిన సింగారపు వెంకటేష్ బైకుపై ఒంగోలు నుంచి మేదరమెట్ల వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుండ్లపల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ముందు వెళ్తున్న లారీని ఢీకొన్నాడు. దీంతో బైకుతో పాటు వెంకటేష్ కాలు లారీలో ఇరుక్కుపోయింది. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న ఎస్‌ఐ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం బైక్‌ను కట్ చేసి క్షతగాతుడిబయటకు తీశారు.అనంతరం చికిత్స నిమిత్తం ఒంగోలు ఆసుపత్రికి తరలించారు.

పశు వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచి రవి

ఉచిత పశు వైద్యశిబిరం

ప్రజాశక్తి - నిజాంపట్నం

పశువుల ఆరోగ్యం పట్ల పశుపోషకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కొత్తపాలెం సర్పంచి కొక్కిలిగడ్డ రవి తెలిపారు.మండల పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని గ్రామ సర్పంచి రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడు తూ పశుపోషకుల ఆర్థికాభివద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కూచినపూడి పశువైద్యాధికారి డాక్టర్ ఎం.హేమప్రియ మాట్లాడుతూ పశుపోషకులు గేదెలకు సకాలంలో టీకాలు వేయించాలన్నారు. అదేవిధంగా గొర్రెలకు, మేకలకు బొబ్బ నివారణ టీకాలు వేయించాలన్నారు. ఈ కార్యక్ర మంలో సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు శ్రీనివాసరావు, గోవర్ధన్, పున్నయ్య శాస్త్రి, సంగమేశ్వర శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ ఇన్‌ఛార్జుల నియామకం

ప్రజాశక్తి- మేదరమెట్ల

ఎంఆర్‌పిఎస్ అద్దంకి నియోజక వర్గ ఇన్‌ఛార్జులు తేళ్ల శ్రీనివాసరావు ,పూనూరి రమేష్ బాబును ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజ్ మాదిగ నియమించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు, నాగరాజ్ మాట్లాడుతూ తమపై నమ్మకంపై ఇన్‌ఛార్జులుగా నియమించిన ఎంఆర్‌పిఎస్ జాతీయ, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన జగన్

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - చీరాల

రాష్ట్రాన్ని వైఎస్. జగన్మోహన్ రెడ్డి అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల, గృహ నిర్మాణశాఖల మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. మండల పరిధిలోని దేవాంగపురి గ్రామంలో చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య ఆధ్వర్యంలో టిడిపి సీనియర్ నాయకుడు, గౌతమ్ హ్యాండ్లూమ్స్ అధినేత సిద్ధి బుచ్చేశ్వరరావు అధ్యక్షతన పల్లె పండగ వారోత్సవ సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక నాలుగు లక్షల కోట్ల పెట్టుబడులను సిఎం చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌కు తీసుకొచ్చినట్లు తెలిపారు. పోలవరం ప్రాజెక్టును జగన్ నిర్వీర్యం చేశారన్నారు. గత పాలకుల చేసిన పాపాలను తాము కడుగుతున్నామన్నారు. ఎంతో

సిపి రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి

చరిత్ర కలిగిన ప్రాంతాలలో చీరాల ప్రాంతం ఒక్కటన్నారు. గత వైసీపీ ప్రభుత్వం లెక్కా పత్రం లేకుండా నిధులను ఖర్చు పెట్టడం వల్లే రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని మంత్రి ఆరోపించారు . రాష్ట్రంలో నైపుణ్య కళాశాల నిర్మించి తద్వారా నైపుణ్యం కలిగిన యువతను తయారు చేయడానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. రానున్న ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగాల కల్పనే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. రాష్ట్రంలో నూతనంగా నిర్మించిన గృహాలను లబ్ధిదారులకు త్వరలోనే అందిస్తామన్నారు. గత ప్రభుత్వంలో గృహాలు నిర్మించుకొని బిల్లులు రాని వారికి బిల్లులు మంజూరు చేస్తామని తెలిపారు. చీరాల ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య మాట్లాడుతూ సిఎం సహకారంతో చీరాల నియోజకవర్గంలో చేనేత టెక్స్టైల్ పార్కు, ఐటి హబ్ తీసుకురావడంతో పాటు తీర ప్రాంతాన్ని పర్యాటక రంగంగా అభివృద్ధి చేస్తామన్నారు. నియోజకవర్గ అభివద్ధికి అహర్నిశలు కషి చేస్తానన్నారు.అనంతరం పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా రూ.47.5 లక్షల ఎన్ఆర్‌జిఎస్ నిధులతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకట మురళి, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూముల స్వాధీనానికి రంగం సిద్ధం

ప్రజాశక్తి- వేటపాలెం

కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొనేందుకు రెవెన్యూ, డ్రైనేజీ డివిజనల్ స్థాయి అధికారులు దృష్టి సారించారు. అసైడ్, డ్రైనేజీ భూముల ఆక్రమణలను గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకొనేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అందులో భాగంగా నాలుగు రోజుల క్రితం మండల పరిధిలోని రైల్వేస్టేషన్ వెనుకవైపు సంతరావూరు వెళ్లే రహదారికి ఎడమవైపు వేటపాలెం రెవెన్యూ గ్రామం సర్వే నంబరు 253లో చీరాల సబ్‌డివిజనల్ డ్రైనేజీ శాఖకు చెందిన ఐదున్నర ఎకరాల్లో రెవెన్యూ, డ్రైనేజీ శాఖ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సర్వేనంబర్‌లో డ్రైనేజీ శాఖకు సంబంధించిన భూమి 20 ఎకరాలు ఉంది.ఈ స్థలానికి తూర్పు వైపు పంట కాలువ, ఉత్తరం వైపు సంతరావూరు రోడ్డు, పడమర వైపు రొంపేరు మురుగు కాలువ, దక్షిణం కొత్త కాలువ ఉంది.ప్రభుత్వానికి

అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

చెందిన విలువైన భూములు ప్రజా అవసరాలకు కాకుండా ప్రైవేటు వ్యక్తుల ఆక్రమణ చరలో ఉన్నాయి. ఒకరిని మరొకరు ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఆక్రమించి భూముల్లో రొయ్యల చెరువులు ఏర్పాటు చేస్తున్నారు. ఆక్రమణల వల్ల కాలువ కట్టలు కుచించుకుపోతున్నాయి. ఫలితంగా అధిక వర్షం పడిన సమయంలో నీటి ప్రవాహానికి ఆటంకంగా మారుతుంది. పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. రొయ్యల చెరువుల నుంచి వచ్చే వ్యర్థాల కారణంగా భూగర్భజలాలు కలుషితంఅవుతున్నాయి. ఆ నీరు తాగిన ప్రజలు రోగాల బారీన పడుతున్నారు. రొయ్యల చెరువుల వ్యర్థాల కారణంగా తాగునీరు కలుషితం అయి తాము రోగాల బారీన పడుతున్నాయని, ఆక్రమ రొయ్యల చెరువులు తొలగించాలని కోరుతూ రాధాకృష్ణపురం ప్రజలు గతంలో ఆందోళన చేశారు.అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. అందులో భాగంగా విజిలెన్స్ అధికారులు భూములను సర్వే చేశారు. పభుత్వ భూమి ఆక్రమణలకు గురైనట్లుగా నిర్ధారించి అధికారులకు నివేదికలు అందజేశారు. ఎట్టకేలకు చెరువుల ఆక్రమణల తొలగింపునకు అధికారులు రంగం సిద్ధం చేయడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి-కారంచేడు

మండల పరిధిలోని స్వర్ణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ గోపీనాథ్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. జ్వరాల గురించి ఆరా తీశారు. రక్తపూతలు , ఫీల్డ్ సర్వే, సూపర్‌వైజర్ల పనితీరు, లేబరేట రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హన్మప్రియ, సూపర్‌వైజర్ రవికుమార్, హెచ్‌ఇ మీనా కుమారి, హెచ్‌వి మాధురి సిపోరా , లాబ్ టెక్నీషియన్ భయ్యా శంకర్, ఎఎన్ఎంలు నాగలక్ష్మి ,సౌజన్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్ సందర్శన

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

వ్యవసాయ మార్కెటింగ్ రాష్ట్ర సంచాలకులు కె. విజయ సునీత పర్చూరు ఎఎంసి పరిధిలోని మార్టూరు పెద్ద కూరగాయల మార్కెట్‌ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ అబ్దుల్ రజాక్, టిడిపి పట్టణ అధ్యక్షుడు కామినేని జనార్ధన్‌తో కలిసి కూరగాయల మార్కెట్‌లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి విజయసునీతకు వివరించారు. ఈ సందర్భంగా అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ కూరగాయల మార్కెట్‌లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రధానంగా పెద్ద కూరగాయల మార్కెట్ ఆవరణలో గత కొన్ని సంవత్సరాలుగా సివిల్ సప్లయ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల లెవెల్ స్టాక్ పాయింట్‌ను నూతనంగా నిర్మించిన గోడౌన్‌లోకి మార్చాలన్నారు. అలా చేస్తే రైతులకు గదులు ఏర్పాటు చేయడానికి వీలు కలుగుతుందన్నారు. మార్కెట్‌లో వాచ్ మెన్ లేకపోవడం వల్ల భద్రతా సమస్యలు తలెత్తుతున్నట్లు తెలిపారు. వాచ్ మెన్‌ను నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

విజయసునీతకు సమస్యలు వివరిస్తున్న అబ్దుల్ రజాక్

ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు తీసుకొస్తున్న వాహనాలకు నూతన గూడెంలో పార్కింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. దీంతో స్పందించిన విజయ సునీత మాట్లాడుతూ మార్కెట్‌లోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్ ఝాన్సీ, అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్, టిడిపి బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షుడు తొండెపు ఆదినారాయణ, శ్రీవిఘ్నేశ్వర కూరగాయల వర్తక సంఘం అధ్యక్షుడు గుడిపూడి సాంబశివరావు, రైతులు పాల్గొన్నారు.



బుజ్జిబాబును సన్మానిస్తున్న వరికూటి అశోక్‌బాబు

బుజ్జిబాబుకు అభినందనలు

ప్రజాశక్తి-వేమూరు

మండల పరిధిలోని బలిజేపల్లి గ్రామ వైసిపి అధ్యక్షుడిగా రావిపూడి బుజ్జిబాబు ఏకగ్రీవంగా ఎన్నియ్యాడు. వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు అధ్యక్షతన మంగళవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రావిపూడి బుజ్జి బాబును వైసిపి అధ్యక్షుడిగా ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిధి కోగంటి లవకుమార్, వైసిపి భట్టిప్రోలు మండల అధ్యక్షుడు పి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

30న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి -రేపల్లె

బాపట్ల పట్టణంలోని రేపల్లె – బేతపూడి రోడ్‌నున్న శారద ఐటిఐ కళాశాలలో రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 30న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటిఐ కళాశాల కరస్పాండెంట్ బడుగు వెంకట నారాయణ తెలిపారు. టెన్త్. ఇంటర్ ఐటిఐ డిప్లమా చదివిన 18 నుంచి 27 సంవత్సరాలలోపు వయస్సు వారు ఈ జాబ్ మేళాలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. జాబ్ మేళాలకు హాజరయ్యే అభ్యర్థులు ఆధార్ , పాన్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలు తమ వెంట తీసుకురావాలన్నారు.

'సెయింట్ ఆన్స్'లో వర్క్‌షాపు

ప్రజాశక్తి -వేటపాలెం

సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సిఎస్ఇ విభాగంలో ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న హెకథాన్ ఆన్ ఎఐ ఫుల్‌స్టాక్‌పై వర్క్‌షాపును మంగళ వారం ప్రారంభిం చినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్.లక్ష్మణరావు మంగళవారం తెలిపారు ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కె. జగదీష్‌బాబు మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో అనుబంధం పెంచుకోవటం వల్ల ఆధునిక ఐటి పరిశ్రమలలో ఉత్తమంగా రాణించవచ్చని తెలిపారు. ఐదు రోజులపాటు హెకథాన్ ఆన్ ఎఐ ఫుల్‌స్టాక్‌పై వర్క్‌షాపును హైదరాబాదుకు చెందిన మేక్ స్కిల్డ్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సిఎస్ఇ విభాగాధిపతి పి.హరిణి తెలియజేశారు. ఈ వర్క్ షాపులో పాల్గొనడం వల్ల విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో మమేకం అయ్యేందుకు అవకాశం కలుగుతుందన్నారు మేక్ స్కిల్డ్‌కు చెందిన మధు ఆయన బందం ఆధ్వర్యంలో ఎఐ ఫుల్‌స్టాక్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ వర్క్‌షాపుకు టి.శేషసాయి కోఆర్డినేటరుగా వ్యవహించనున్నట్లు వారు తెలిపారు.

మాట్లాడుతున్న శేషసాయి

31న జాబ్ మేళా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -బాపట్ల

బాపట్ల నియోజకవర్గం పరిధిలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించేందుకు ఈ నెల 31న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. మ్యాజిక్ బస్ ఫౌండేషన్ సౌజన్యంతో ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ జాబ్ మేళాలో 50 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటాన్నారని తెలిపారు. 1000 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించ నున్నట్లు తెలిపారు. 10వ తరగతి నుంచి పీజీ వరకూ చదివిన వారు జాబ్ మేళాకు హాజరు కావచ్చునని తెలిపారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు ఆధార్ కార్డు,పాస్ పోర్ట్ సైజు ఫొటో , విద్యార్హత సర్టిఫికెట్లు తమ వెంట తీసుకురావాలన్నారు.ఆసక్తి కలిగిన వారు తమ పేర్లను ఈనెల 30లోపు స్థానిక టిడిపి కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 8500015566, 8179192707. సెల్ నెంబర్ల సంప్రదించాలన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, తదితరులు

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి - రేపల్లె

విజయవాడలోని మున్సిపల్ స్టేడియంలో గణతంత్ర దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో స్థానిక ఎబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొని కవాతు నిర్వహించారు. కవాతులో పాల్గొన్న విద్యార్థులను మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి కేర్ టేకర్ కె. బాలాగురవయ్య, మాట్లాడుతూ తృతీయ సంవత్సరం బిఎస్‌సి విద్యార్థిని ఎం. సుప్రియ, ద్వితీయ సంవత్సర బిఎ విద్యార్థిని పి. గాయత్రీ, ద్వితీయ సంవత్సరం బికాం విద్యార్థి బి నాగరాజు కవాతులో పాల్గొన్నట్లు తెలిపారు. విద్యార్థులను అభినందించిన వారిలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవి చంద్ర కుమార్, 22 ఆంధ్రా బెటాలియన్ పిఐ స్టాఫ్, రామ్ రాజు, అనంత సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న వీవోఏలు

కొనసాగుతున్న వీవోఏల నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

వీవోఏల సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏపీ వెలుగు యానిమేటర్ ఉద్యోగుల సంఘం (సిఐటియు ప్రకాశం జిల్లా కమిటీ) ఆధ్వర్యంలో ఒంగోలు డిఆర్‌డిఏ పీడీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రెండో రోజు సాగిన ఈ ధర్నా కార్యక్రమంలో వివోఏ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి మహేష్ మాట్లాడుతూ వివోఎల కి రావలసిన 6 నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ కోర్టు తీర్పును అమలు చేయాలని పలుమార్లు జిల్లా కలెక్టర్‌ను సంప్రదించినా న్యాయం జరగకపోవటం విచారకరమన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కు అందించారు. కార్యక్రమంలో ఆనంద్, బెహర, ఫ్లోరా పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

డ్రైనేజీ కాలువ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

నగరంలోని కర్నూల్‌రోడ్డులో రమ్య ఫాస్ట్‌ఫుడ్స్ వద్ద డ్రైనేజి కాలువ నిర్మాణ పనులను నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. అక్కడ ఉన్న విద్యుత్ స్తంభాల మార్పు, ట్రాఫిక్‌కు వచ్చే ఇబ్బందులపై ట్రాఫిక్ సిఐ పాండు రంగారావు, విద్యుత్ శాఖ పట్టణ ఏడిఇ కెవిపి రంగారావుతో చర్చించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా విద్యుత్ స్తంభాలు మార్చాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ శివప్రసాద్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



షహనాజ్‌కు అవార్డు అందజేస్తున్న సినీ హీరో శ్రీకాంత్

'సూర్య శ్రీ' ట్రస్టు సేవలకు అవార్డు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

గత ఆరు సంవత్సరాలుగా సామాజిక సేవారంగంలో సేవలందిస్తున్న సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్టు శ్రీజనమంచి గౌరీశంకర్ అవార్డుకు ఎంపికైంది. ట్రస్ట్ ద్వారా చైర్మన్ సయ్యద్ షహనాజ్ దంపతులు ముఖ్యంగా వికలాంగులకు ఆశ్రయాన్ని కల్పించి.. విద్య, వైద్యంతో పాటు ఉపాధిని అందిస్తున్నారు. ఈ సేవలను గుర్తించి.. ఎబివిపి 43వ రాష్ట్ర మహాసభలలో భాగంగా ఈ సంవత్సరం విశాఖపట్నంలో శ్రీ జనమంచి గౌరీ శంకర్ అవార్డును ట్రస్ట్ వారికి అందజేశారు. అవార్డుతో పాటు ప్రోత్సాహక నగదు రూ.50 వేలను హీరో శ్రీకాంత్ ద్వారా షహనాజ్ అందుకున్నారు. ఈ సందర్భంగా షహనాజ్ దంపతులను ట్రస్టు వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ తదితరులు అభినందించారు.

11న ఎల్ఐసి ఏజెంట్ల చలో ఢిల్లీ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మాట్లాడుతున్న రాజశేఖర్

ఎల్ఐసిలో నూతనంగా ప్రవేశ పెట్టే మార్పులను వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 11న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసిఎఒఐ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె రాజశేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం నాడు ఒంగోలులోని యుటిఎఫ్ కార్యాలయంలో ఎల్ఐసిఎఒఐ ఒంగోలు బ్రాంచ్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాజశేఖర్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. 2024 అక్టోబర్ 1 నుండి ఇన్సూరెన్స్ పాలసీలలో తెచ్చిన మార్పులు కారణంగా ఏజెంట్లు అనేక విధాలుగా నష్టపోతున్నారని అన్నారు. ఈ నష్టాన్ని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ దశలవారీగా ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కోటి సంతకాల సేకరణ, పార్లమెంటు సభ్యులకు వినతి పత్రాలు సమర్పణ, అంతిమంగా ఫిబ్రవరి 11న ఛలో ఢిల్లీ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఏజెంట్లు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు మాట్లాడుతూ ఐఆర్డిఏఐని అడ్డుపెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసి సంస్థను దెబ్బతీసి, కార్పొరేట్లకు అప్పగించే ప్రయత్నాలు చేస్తుందన్నారు. అందులో భాగంగానే ప్రస్తుత మార్పులు చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వ కుట్రపూరిత విధానాలను ఎల్ఐసి ఏజెంట్లు గమనించి తిప్పి కొట్టాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కె.బాలచంద్రం, నల్లూరి వెంకట్రావు, డివిజన్ అధ్యక్షులు బెజవాడ శివయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బి. వెంకట్రావు, ఒంగోలు బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వెంకటేశ్వర్లు, సిహెచ్ వి.సుబ్బారెడ్డి, నాయకులు ఎం.బసవయ్య, బి.కష్ణమూర్తి, సిహెచ్. నరసింహారావు, కె.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల కోటాను పెంచాలి

చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఈడీ వెంకటేశ్వరరావుకు అర్జీ ఇస్తున్న నాయకులు

బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందించే లబ్ధిదారుల కోటాను పెంచాలని ప్రకాశం జిల్లా చేతివృత్తిదారుల జిల్లా సమన్వయ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆ మేరకు కమిటీ ప్రతినిధులు బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం వెంకటేశ్వరరావును కలసి వినతి పత్రం అందించారు. జిల్లాకు కేటాయించిన కోటా పరిమితంగా ఉందని, కనీసం గ్రామానికి ఒకటి కూడా దక్కేలా లేదని ఈడి దష్టికి తీసుకు వెళ్లారు. జిల్లాలో బీసీల జనాభాతో పాటు, నిరుద్యోగ యువత కూడా అదే స్థాయిలో ఉందని ఆ మేరకు లబ్ధిదారుల కోటాను పెంచాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ప్రభుత్వానికి తెలియజేస్తామని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హామీ ఇచ్చారు. ఈ నెల 30వ తేది నుంచి ఫిబ్రవరి 6 వరకు ఆన్లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవచ్చని కమిటీ సభ్యులకు ఆయన సూచించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను కలిసిన వారిలో గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం, రజక వత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శులు తోట తిరుపతిరావు, రాయల మాల కొండయ్య, జిల్లా రజక వత్తిదారుల సంఘం ఉపాధ్యక్షులు ఆవులమంద రమణమ్మ, జిల్లా కమిటీ సభ్యులు వేములపాటి మల్లికార్జున ఉన్నారు.

ఫొటోగ్రాఫర్లకు అండగా ఉంటా..: దామచర్ల

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఫొటోగ్రాఫర్లతో ఎమ్మెల్యే దామచర్ల

ఫొటోగ్రాఫర్లకు ఎల్లవేళలా అండగా ఉంటానని, ఇళ్లస్థలాల కేటాయింపులో వారికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తానని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు పేర్కొన్నారు. స్థానిక తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపంలో మంగళవారం ఒంగోలు ది ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ డెవలప్మెంట్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం, ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ కు వర్క్ షాప్ నిర్వహించారు. తొలుత కానన్ కెమెరా కంపెనీ మాస్టర్ ట్రైనర్ షేక్ పర్వేజ్ కొత్త కెమెరాల అప్‌డేట్స్‌ను కెమెరామెన్‌లకు వివరించారు. ముఖ్యఅతిథిగా దామచర్ల మాట్లాడుతూ రాబోయే రోజులలో ఒంగోలు నగరంలో 2 సెంట్ల ఇళ్ల స్థలాల్లో ప్రథమ ప్రాధాన్యత కల్పిస్తానన్నారు. ఫోటోగ్రాఫర్స్‌కు పోస్టల్ డిపార్ట్మెంట్ కల్పిస్తున్న గ్రూప్ ఇన్సూరెన్స్ మంచి కార్యక్రమమని చెప్పారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించిన గౌరవాధ్యక్షులు జెమిని శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే దామచర్ల ఫొటోగ్రాఫర్లకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు వెంకట్రావు, సలహాదారులు మట్ట సత్యం, ఉదయ హరిబాబు, ప్రెసిడెంట్ స్పందన వెంకట్రావు, కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు ఉప్పుటూరి చంద్ర, వెంకటేశ్వర్లు, కోశాధికారి రసూల్, భాస్కర్, పొదిలి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అశోక్‌నగర్‌లో తాగునీటి సమస్య పరిష్కరించాలి

సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఒంగోలు నగర పరిధిలోని అశోక్‌నగర్‌లో తాగునీటి సమస్య పరిష్కరించాలని సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం నాడు అశోక్ నగర్‌లో ఆ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16 డివిజన్ పరిధిలోని అశోక్ నగర్‌లో మూడు రోజులకు ఓసారి టాంకర్ ద్వారా సరఫరా చేసే నీరు సరిపోవడం లేదన్నారు. ఏడు ఇళ్లకు ఒక ట్యాంకర్ చొప్పున నీరు అందించడం, వారం రోజుల పాటు డ్రమ్ముల్లో నీరు నిలువ చేసుకోవడంతో నీటిలో పురుగులు చేరి వాసన వస్తున్నాయన్నారు. ఆ నీరు తాగటం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. కార్పొరేషన్ అందించే నీరు సరిపోక 70 కుటుంబాలు ఒక్కొక్కరు 20 రూపాయలు చొప్పున నీటిని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి తాగునీరు సమద్ధిగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న అరవింద్ హాస్పిటల్ వైద్యులు

'అరవింద్' హాస్పిటల్‌లో అరుదైన చికిత్స

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఒంగోలు లోని అరవింద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో ఊబకాయానికి అరుదైన చికిత్స అందించారు. మంగళవారం నాడు జరిగిన విలేకరుల సమావేశంలో హాస్పిటల్ వైద్య బృందం డాక్టర్ మందలపు నరేంద్రబాబు, డాక్టర్ నూతంగి భాను తేజ, డాక్టర్ నూతంగి వెంకటేష్ వివరాలను వెల్లడించారు. ఒంగోలుకు చెందిన నిఖిల్ (27) 165 కిలోల బరువు ఊబకాయంతో బాధపడుతున్నారు. సరిగా నడవలేని స్థితిలో డాక్టర్ నరేంద్రబాబును సంప్రదించారు. నిఖిల్ కు ఎండోస్కోపిక్ పద్ధతి ద్వారా పొట్టలో బెలూన్ ప్రవేశపెట్టి ఏడాది తిరగకముందే 56 కిలోలకు 109కి తగ్గించినట్లు వివరించారు. ఎటువంటి గాటు, కోత లేకుండా మత్తు వైద్యుని పర్యవేక్షణ లో సాగిన ఈ ప్రక్రియ ప్రకాశం జిల్లాలో మొదటిదిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజర్ తిరుమలరావు, సిబ్బంది పాల్గొన్నారు

1న గృహ ప్రవేశాల వేడుక

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఫిబ్రవరి ఒకటో తేదీన సామూహిక గహప్రవేశాల వేడుక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హౌసింగ్ కార్పొరేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ పిఎస్ శ్రీనివాస్ ప్రసాద్ తెలిపారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్మాణం పూర్తయిన 2994 నూతన గహాల ప్రవేశ కార్యక్రమం జిల్లావ్యాప్తంగా చేపట్టినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గాల స్థాయిలో మండలాల స్థాయిల్లో శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధుల సారథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. మార్కాపురం 671, దర్శి 507, ఎర్రగొండపాలెం 492, కనిగిరి 355, గిద్దలూరు 334, ఒంగోలు 239, సంతనూతలపాడు 199, కొండపి 141 గహాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

వాహన తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసులు

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. నగరంలోని బైపాస్ జంక్షన్‌లో మంగళవారం వాహన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు పెండింగ్ చలానాలను వెంటనే మీ సేవా కేంద్రాల్లో చెల్లించాలని చెప్పారు. కార్యక్రమంలో ట్రాఫిక్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డి3 పరిధిలో బుధవారం పేర్నమిట్ట, అంబేద్కర్ నగర్, ఈనాడు ఆఫీసు, ప్రతిభ కాలేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, టొబాకో బోర్డు, ద్వారకా నగర్ తదితర ప్రాంతాలలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ మరమ్మత్తుల కారణం వల్ల విద్యుత్తు సరఫరా అంతరాయం ఉంటుందని ఒంగోలు టౌన్ డిఈఈ కెవి.పాండురంగారావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

చర్యలు తీసుకోవాలని స్థానికుల నిరసన

ప్రజాశక్తి-కనిగిరి

నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

కనిగిరి పట్టణంలోని శివనగర్ కాలనీలో విద్యుత్ స్తంభం ఒరిగి ప్రమాదక రంగా ఉండటంతో స్థానిక ప్రజలు స్తంభం వద్ద నిరసన తెలిపారు. పలుమార్లు విద్యుత్ శాఖ, సచివాలయ సిబ్బందికి తెలిపినా పట్టిం చుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రెండో వార్డు టిడిపి ఇన్‌ఛార్జ్ రాచర్ల వెంకట నారాయణ విమర్శించారు. ఏదైనా ప్రమాదం జరిగితే విద్యుత్ శాఖ బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో కంభం నాగవేణి, రవణమ్మ, ప్రసాదు, వెంకట్రావు, రాజమ్మ, భూలక్ష్మి, ధనమ్మ, పద్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-సిఎస్ పురం

సబ్సిడీ రుణాల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఓ రంగసుబ్బరాయుడు తెలిపారు. రుణాలకు సంబంధించి ఈ నెల 30వ తేదీ నుంచి వెబ్‌సైట్ ఓపెన్ అవుతుందన్నారు. ఫిబ్రవరి 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మండలంలోని అర్హులు అర్హత కలిగిన యూనిట్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కూలీలందరికీ పనులు కల్పించాలి

ప్రజాశక్తి-సిఎస్ పురం

గ్రామాల్లో కూలీలందరికీ పని కల్పించాలని ఉపాధి హామీ పథకం ఏపీడీ రాజారావు తెలిపారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో క్షేత్ర సహాయకులతో మంగళవారం సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జాబ్‌కార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. చనిపోయిన వారిని జాబ్‌కార్డుల నుంచి తొలగించాలని సూ చించారు. ప్రతి 50 మందికి ఒక మేట్‌ని ఏర్పాటు చేయాల న్నారు. ఉపాధి పనుల కల్పించే విషయంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో గోకులం షెడ్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

హెల్త్ పెన్షన్లు పరిశీలన

ప్రజాశక్తి-పీసీపల్లి

మండలంలోని వివిధ గ్రామాలలో హెల్త్ పెన్షన్లు పొందు తున్న 18 లబ్ధిదారులను మంగళవారం వైద్య బృందం తనిఖీ చేసినట్లు స్థానిక ఎంపీడీఓ ప్రభాకర్ శర్మ తెలిపారు. డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ సౌజన్య బృందం పరీక్షలు చేసి వివరా లను జిల్లా అధికారులకు పంపిస్తున్నట్లు తెలిపారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-దర్శి

పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ ఎం.మురళీ మంగళవారం తెలిపారు. మండలంలోని జముకులదిన్నె పొలాలలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన చెప్పారు. వీరి నుంచి లక్షా రెండు వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నామన్నారు. సిఐ వై.రామారావు ఆధ్వర్యంలో పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ రాంబాబు, సిహెచ్.శంకర్, గురుబాబు, మహేష్, జిలాని తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని చినమనగుండం, చౌటపల్లి గ్రామాలలో మంగళవారం పశువైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించినట్లు పశువైద్యాధికారులు డాక్టర్ వి.రాజ్యలక్ష్మి, డాక్టర్ అమూల్య తెలిపారు. ఆయా గ్రామాల్లోని పశువులు, జీవాలకు వైద్య పరీక్ష నిర్వహించి మందులను పంపిణీ చేశారన్నారు. అనారోగ్యంతో ఉన్న జీవాలను పరీక్షించి వాటికి వ్యాక్సిన్లు వేసి మందులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వి.రాజ్యలక్ష్మి, సిహెచ్.అమూల్య, లైవ్ స్టాక్ అసిస్టెంట్లు వరలక్ష్మి, పూర్ణచంద్ర, పశువైద్య సహాయకులు మోగావత్‌నాయక్, పిల్లి నాగార్జునరెడ్డి, సిబ్బంది శ్రీనివాసులు, కె.వెంకటేశ్వర్‌రెడ్డిలు, మహబూబ్‌బాషా, నాగేంద్రమ్మ, నాగరాజు, శ్రీజ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గీతాంజలి హైస్కూల్, బొమ్మరిల్లు ఆశ్రమం విద్యార్థులను అభినందిస్తున్న ఈదర హరిబాబు

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

ఒంగోలు పివిఆర్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో 11వ రోజు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. ఒంగోలు వీధి బాలల – బాల కార్మికుల ఆశ్రమం "బొమ్మ రిల్లు" బాల బాలికలు పరదర్శించిన "చెట్టమ్మ చెట్టమ్మ పచ్చని చెట్టమ్మ – నీవు లేక మానవ మనుగడలేనే లేద మ్మా" అంటూ సాగిన నృత్య గీతిక వృక్షాల ప్రాధాన్యతను కళ్ళకు కట్టినట్లు చూపించారు. ఒంగోలు అపెక్స్ హై స్కూల్ వారు ప్రదర్శించిన " శ్రమకు కృషి తోడైతే జయం నీదే" అంటూ బాలలు ప్రదర్శించిన "శ్రమయేవ జయతే" సందేశాత్మక నాటిక చక్కని సందేశాన్ని ఇచ్చింది. ఒంగోలు గీతాంజలి హై స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన కూచి పూడి, తదితర నాట్య ప్రదర్శనలు ప్రేక్షకులను అలరిం చాయి. తొలుత రత్తయ్య నాదస్వర బృందం అలపించిన నాదస్వరం, ఎండ్లూరుకు చెందిన తోట స్వాములు సా రథ్యంలో సీతారామాంజనేయ కోలాట బృందం ప్రదర్శిం చిన కోలాటం, దర్శికి చెందిన జాన్ మాస్టర్ సారథ్యంలో ప్రశాంతి హై స్కూల్ వారు ప్రదర్శించిన కోలాటం వీక్షకులను ఆకట్టుకుంది. హైదరాబాదుకు చెందిన కొల్లా రాధాకృష్ణ దర్శకత్వంలో కళాంజలి వారు ప్రదర్శించిన "జారుడుమెట్లు" సందేశాత్మక నాటకం ప్రేక్షకులకు చక్కని సందేశాన్ని అందించింది. ఈ సందర్భంగా కళాపరిషత్ నిర్వాహకులు ఈదర హరిబాబు, బెజవాడ వెంకటరావు, అన్నంనేని ప్రసాదరావు, శివప్రసాద్ తదితరులు కళాకారులను సత్కరించారు.

జీవాలకు టీకాలు వేయించాలి

ప్రజాశక్తి- సిఎస్‌పురం రూరల్

పశు పోషకులు తమ పశువులు, సన్నజీవాలకు వ్యాధు లు సోక కుండా సకాలంలో టీకాలు వేయించుకోవాలని డీజీపేట పశువైద్యాధికారి డాక్టర్ షేక్ మునీర్ అన్నారు. మండలంలోని చింతపూడి రైతు సేవా కేంద్రం పరిధిలోని కంభంపాడు గ్రామంలో మంగళవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రతి వ్యాధికి టీకాలు హాస్పిటల్‌లో అందుబాటులో ఉ న్నాయన్నారు. పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాల ని కోరారు. గ్రామంలోని 480 గేదె దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాపించారు. ఆరు పశువులకి కృత్రిమ గర్భధారణ, పన్నెండు పశువులకి చూడి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సహాయకులు పందిళ్ళ ఎల్లయ్య, శివనారాయణ, వెంకటేశ్వర్లు, నూర్జహాన్, గొసియా, పశు పోషకులు, సన్న జీవాల పోషకులు పాల్గొన్నారు.

టీకాల వివరాలు తెలియజేసే పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న గ్రామస్తులు

ఇది డంపింగ్ యార్డు కాదు

అధ్వానంగా మేదరమెట్ల ఫైలాన్ పరిసరాలు

పరిశీలించిన సీపీఎం నాయకులు

ప్రజాశక్తి-మేదరమెట్ల

పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఈ చిత్రంలో కనిపిస్తున్న ప్రదేశం డంపింగ్ యార్డ్‌ను పోలి ఉంది. కానీ డంపింగ్ యార్డ్ కాదు. ప్రజలు నిత్యం తిరిగే స్థలమే. ఉదయాన్నే దూరప్రాంతాల నుంచి బస్సుల్లో వచ్చే ప్రయాణికులు ఇక్కడే దిగుతుంటారు. ఈ ప్రదేశంలో చెత్త, కొబ్బరిబొండాల వ్యర్థాలు వేయడంతో ఈ ప్రాంతం డంపింగ్ యార్డును తలపిస్తోంది. మేదరమెట్లలోని ఫైలాన్ వద్ద ఉన్న పరిస్థితి ఇది. ఈ ప్రదేశాన్ని శుక్రవారం సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ఆంజనేయులు, ప్రజానాట్య మండలి గౌరవాధ్యక్షులు బొంతు దశరథ సందర్శించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ మేదర మెట్లలో వచ్చే వ్యర్థ పదార్థాలు అన్నీ ఇక్కడే వేస్తున్నారని తెలిపారు. మృతి చెందిన కళేబరాలను అక్కడే వదిలేస్తున్నారని దీంతో దుర్గంధం వెదజల్లుతోందన్నారు. పిల్లలు, వృద్ధులు జబ్బుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి పరిష్కరించాలని కోరారు.

31న జాబ్ మేళా

ప్రజాశక్తి-దర్శి

శ్రీ పొట్టిశ్రీరాములు డిగ్రీ కళాశాలలో ఈ నెల 31న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి.నారాయణ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ పి.పెద్దిరాజు తెలిపారు. హెట్రో డ్రగ్స్, ఎస్‌బిఐ క్రెడిట్ కార్డ్‌లు మరియు ఎయిర్‌టెల్ పేమెంట్, బ్యాంకు కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటాయన్నారు. హెట్రో డ్రగ్స్‌లో 50 ఖాళీలు, ఎస్‌బిఐ క్రెడిట్ కార్డ్స్‌లో 20, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకులో 20 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ప్రకాశం జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులు ఇంటర్మీడియట్ నుంచి పీజీ వరకు 19- 28 సంవత్సరాల మధ్య వయస్సు గల వారు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. వివరాలకు కళాశాల స్కిల్ హబ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.నగేష్, స్కిల్ హబ్ ట్రైనింగ్ కో ఆర్డినేటర్ ఎస్.రమేష్ నెంబర్లు 9247433273, 9949914337లలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

30న వికలాంగులకు పరికరాల గుర్తింపు శిబిరం

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

వికలాంగులకు అవసరమైన పరికరాలను అందించేందుకు నిర్వహిస్తున్న శిబిరాను సద్వినియోగం చేసుకోవాలని వికలాంగుల హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు ధూళిపాళ్ల మల్లికార్జునరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో వికలాంగులకు అవసరమైన పరికరాలను అందించేందుకు ఈనెల 30వ తేదీ గురువారం కనిగిరిలోని అమరావతి గ్రౌండ్ లో శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ శిబిరంలో వికలాంగులకు అవసరమైన మూడు చక్రాల సైకిల్, త్రీ వీలర్ బ్యాటరీ బండ్లు, చంక కర్రలు, చేతి కర్రలు, వాకర్స్, వీల్ చైర్లు, చెవిటి మిషన్‌లు, అందులకు చేతి కర్రలు, రోడ్డు ప్రమాదాల్లో కాళ్ల చేతులు కోల్పోయిన వారికి కృత్రిమ అవయవాలు ఇచ్చేందుకు ఈ క్యాంపులో గుర్తించడం జరుగుతుందన్నారు. ఈ శిబిరానికి హాజరయ్యే వారు సదరం సర్టిఫికెట్, రేషన్ కార్డ్, ఆధార్ కార్డు, పాస్ ఫోటోలు, ఫోన్ నెంబర్ తదితరాలు తీసుకొని రావాలని ఆయన తెలిపారు.

విచారణ చేస్తున్న డీఎస్పీ లక్ష్మి నారాయణ

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

ప్రజాశక్తి-కురిచేడు

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ లక్ష్మీనారాయణ విచారణ చేపట్టారు. కురిచేడు మేజర్ పంచాయితీలో గత రెండేళ్ల క్రితం కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న పెనుగొండ వెంకటరెడ్డి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డాడని, అలాగే నిధుల దుర్వినియోగంపై వివరణ కోరడానికి వెళ్లిన కురిచేడు సర్పంచ్ కేశవపల్లి క్రిష్ణయ్యను కులం పేరుతో దూషించగా సర్పంచి ఫిర్యాదు మేరకు పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసుల విషయమై దర్శి డీఎస్పీ మంగళవారం కురిచేడు పోలీసు స్టేషన్‌కి వచ్చి సర్పంచ్ కేశవపల్లి క్రిష్ణయ్యను, ఈఓ చాంద్‌బిని విచారించారు. ఆయన వెంట కురిచేడు ఎస్ఐ యం.శివ ఉన్నారు.

బిందు సేద్యంపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-దర్శి

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బిందుసేద్యంపై ఎస్సీ, ఎస్టీ రైతులకు అవగాహన కల్పించారు. దర్శిలోని ఉద్యాన వ్యవసాయ పరిశోధన కేంద్రంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జి.రమేష్ మాట్లాడుతూ ప్రకృతి, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులపై, మొక్కజొన్న, మినుము సాగు విధానంపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ టి.వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ నువ్వు పంట సాగు విధానం, వర్మి కంపోస్ట్ సాగు విధానం గురించి తెలిపారు. హోమ్ సైన్స్ శాస్త్రవేత్త మనసు మాట్లాడుతూ వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలకు సంబంధించిన కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకునే అవకాశం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజినల్ కో-ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, ఏరియా కోఆర్డినేటర్స్ గుంటూరు నాగమణి, తప్పెట డేవిడ్, గుత్తి కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముండ్లమూరు, తాళ్లూరు దర్శి, కురిచేడు మండలాల నుంచి ఎస్సీ, ఎస్టీ రైతులు పాల్గొన్నారు. వారికి వ్యవసాయంలో పంటలపై వస్తున్న తెగుళ్ల గురించి వారి సమస్యలను శాస్త్రవేత్తలతో చర్చించుకున్నారు.

రాకపోకలకు మోక్షమెప్పుడో ..?

ప్రజాశక్తి - భట్టిప్రోలు

కూటమి ప్రభుత్వం రహదారుల అభివద్ధికి నిధులు కేటాయించింది. అధ్వానంగా ఉన్న రహదారులను అభివృద్ధి చేయడం మంచి పరిణామమే...అయితే అధికార పార్టీ నాయకుల అండదండలతో అధికారులు, గుత్తేదారులు రహదారుల నిర్మాణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా రాకపోకలు సాగించేందుకు ప్రజలు, వాహన చోదకులు అవస్థలు పడాల్సి వస్తుంది. మండల పరిధిలోని పైలవరం గ్రామ ప్రధాన రహదారి అనేక సంవత్సరాలుగా అభివృద్ధికి నోచలేదు. రాకపోకలు సాగించేందుకు గ్రామస్తులు, వాహన చోదకులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ క్రమంలో ఈ రహదారిని సిసి రోడ్డుగా నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం ద్వారా రూ.50 లక్షలు మంజూరు చేసింది. గత అక్టోబర్‌లో సిసిరోడ్డు నిర్మాణానికి వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శంకుస్థాపన చేశారు. అంతరం 10 రోజుల తర్వాత గుత్తేదారుడు రహదారి నిర్మాణ పనులను ప్రారంభించారు. పనులు

రహదారిపై తొలగించని సిమెంట్ కట్టలు

ప్రారంభించడంతో రహదారిపై రాకపోకలు నిలిపివేశారు. దీంతో గ్రామస్తులు గ్రామానికి పడమర వైపునున్న కాలువ కట్టను రహదారిని వినియోగించుకున్నారు. అదే సమయంలో కొద్దిపాటి వర్షం పడినా కాలువ కట్టపై నడిచేందుకు ప్రజలకు అవస్థలు తప్పలేదు. రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయడానికి గుత్తేదారుడికి రెండు నెలల కాలం పట్టింది. అనంతరం రహదారిపై సిమెంట్‌తో కట్టలు ఏర్పాటు చేసి నీరును నింపి నెలా రోజులుగా క్యూరింగ్ చేశారు. ఇటీవల క్యూరింగ్ నిలుపుదల చేశారు. క్యూరింగ్ కోసం ఏర్పాటు చేసి సిమెంట్ కట్టలను ఇంత వరకూ తొలగించలేదు. క్యూరింగ్ నిలుపుదల చేయడంతో ప్రజలు ఈ రహదారిపైనేఊ రాకపోకలు సాగిస్తున్నారు. సిమెంట్ కట్టలు తొలగించని కారణంగా ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది. రహదారి నిర్మాణం కారణంగా గత మూడు నెలలుగా పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, వైద్య చికిత్సల నిమిత్తం వైద్యశాలకు వెళ్లే రోగులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. రహదారి నిర్మాణం పూర్తయినప్పటికీ దానిపై ఏర్పాటు చేసిన సిమెంట్ కట్టలు ఎందుకు తొలగించలేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఎప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిపై ఏర్పాటు చేసిన సిమెంట్ కట్టలు తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొత్తపేట పంచాయతీ కార్యదర్శి

రమేష్‌బాబుకు మాతృవియోగం

ప్రజాశక్తి - చీరాల,కారంచేడు

వేటపాలెం మండలం కొత్తపేట పంచాయతీ కార్యదర్శి బడుగు రమేష్ బాబుకు మాతృ వియోగం కలిగింది. ఆయన తల్లి బడుగు మరియమ్మ సోమవారం రాత్రి అనారోగ్యంతో మతి చెందారు. మరియమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడున్నారు. కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామంలోని తమ స్వగృహంలో ఉంటున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమిం చడంతో ఆమె మృతిచెందారు. ఈ విషయం గురించి తెలుసుకున్న వేటపాలెం ఎంపిడిఒ రాజేష్, ఇఒఆర్ డి.శ్రీనివాసరావు

నివాళులర్పిస్తున్న ఎంపిడిఒ రాజేష్. ఇన్‌సెట్‌లో మరి యమ్మ(ఫైల్)

మరియమ్మ మృతదేహాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పంచాయతీ సెక్రటరీ బడుగు రమేష్ బాబును వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సానుభూతిని తెలియజేశారు. మంగళవారం సాయంత్రం మరియమ్మకు అంత్యక్రియలు నిర్వహించారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల పరిధిలోని భట్టిప్రోలు గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ కె.లక్ష్మి ప్రసన్న రైతులతో కలిసి మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో కాండం తొలుచు పురుగును గుర్తించినట్లు తెలిపారు. దాని నివారణకు కార్బోఫ్యూరెన్ 3జి గుళికలు ఎకరానికి నాలుగు కిలోల చొప్పున పిచికారీ చేయాలన్నారు. మొక్కజొన్న పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలన్నారు. పంటలు సాగు చేసిన రైతులు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిఇఒలు, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

నగరం : మండల పరిధిలోని మంత్రిపాలెం, అల్లపర్రు గ్రామాల్లో ఎఒ వి.రమేష్ బాబు అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ రైతులతో కలిసి మినుము పంట పరిశీలించారు. పంటల సాగుపై చర్చించారు. వ్యవసాయశాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎఒ మాట్లాడుతూ మినుము పంటల్లో పురుగులు మరియు తెగుళ్ల సమస్య ఉన్నట్లు తెలిపారు. మారుకా మచ్చల పురుగు పిందె దశలో ఆశించి ఎక్కువ నష్టం కలుగుజేయనున్నట్లు తెలిపారు. పురుగు నివారణకు పూతదశలో తప్పనిసరిగా 5 ఎంఎల్ వేప గింజల కషాయం లేదా వేప నూనె 5.0 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో

భట్టిప్రోలులో పంటలను పరిశీలిస్తున్న అధికారులు

వ్యవసాయ విస్తరణ అధికారి కె. నాగ శ్రీనివాసరావు, గ్రామ గ్రామ వ్యవసాయ సహాయకురాలు ఎం. ప్రియాంక, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు .

అద్దంకి : శనగ పంటలో కుంకుమ తెగులు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని అద్దంకి సహాయ వ్యవసాయ సంచాలకులు కె.ధనరాజ్ తెలిపారు. మండల పరిధిలోని మణికేశ్వరం, కొంగపాడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు ధనరాజ్ మాట్లాడుతూ శనగలో కుంకుమ తెగులు నివారణ కోసం ఎకరానికి హెక్సాకోణాజోల్ 400 ఎంఎల్ వంతున పిచికారి చేయాలన్నారు. ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ శనగ రైతులందరూ ఈ- క్రాప్ నమోదు చేసుంచు కోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి ఎస్.దీప్తి,గ్రామ వ్యవసాయ సహాయకులు రాణి ,గుడిపూడి బ్రహ్మయ్య, నర్రా బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు

వేమూరు : మండల పరిధిలోని జాంపని, వేమూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ చందవోలు సునీత మాట్లాడుతూ జొన్న, మొక్కజొన్నలో యజమాన్య పద్ధతులు, ఎరువుల వినియోగం గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

చెరుకుపల్లి : వేరుశనగ పంటలో తుప్పు తెగులు కనిపిస్తుందని, దాని నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ఎఒ అవ్వారు మహేష్ బాబు తెలిపారు. మండల పరిధిలోని బలుసులపాలెం, తుమ్మలపాలెం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ రైతులతో కలిసి వేరుశనగ పంటను పరిశీలించారు. వేరుశనగకు తుప్పు తెగులు సోకినట్లు గుర్తించారు. దాని నివారణకు ఎకరానికి 400 గ్రాముల మాంకో జేబ్ మందు, లేదా 200 ఎంఎల్ ట్రైడి మార్ఫ లేదా, 200 ఎంఎల్ ట్రెబ్యూ కొనజోల్ మందును పిచికారి చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యద్దనపూడి : మండల పరిధిలోని పోలూరు, శ్యామల వారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ చౌడు భూములను జిపసం తో శుద్ధి చేసుకోవాలన్నారు. అనంతరం శనగ పంటను పరిశీలించి యాజమాన్య పద్ధతులపై రైతులకు సూచనలు, సలహాలు చేశారు.ఈ కార్యక్రమంలో వ్యసాయ శాఖ సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

శివ నాగసాయి ప్రియను అభినందిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

శివ నాగసాయిప్రియకు అభినందనలు

ప్రజాశక్తి - చీరాల

చీరాలకు చెందిన జి. శివనాగ సాయి ప్రియ 73 కిలోల మహిళా విభాగంలో జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపికైంది. వచ్చేనెల 3,4 తేదీల్లో ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో నిర్వహిస్తున్న తైక్వాండో క్లబ్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననుంది. అందులో భాగంగా శివనాగ సాయి ప్రియను చీరాల ఎమ్మెల్యే మద్దలూరు మాలకొండయ్య మంగళవారం అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరచి మెడల్ సాధించి చీరాలకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. జి. శివనాగ సాయి ప్రియకు కోచ్‌లుగా ఎస్‌డి.సలావుద్దీన్ ,సిహెచ్.వెంకట ప్రసాద్, పి. ప్రశాంత్ బాబు వ్యవహరించారు.

ఉల్లాస్‌పై వాలంటీర్లకు శిక్షణ

ప్రజాశక్తి- కారంచేడు

స్థానిక వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్ర మంపై వాలంటీర్లకు మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ మనోరంజన్ మాట్లాడుతూ వాలంటీర్లు తమ పరిధిలోని నిర్లక్షరాస్యులను గుర్తించి వారి అక్షరాస్యులుగా తీర్చి దిద్దాలన్నారు. ప్రతి రోజూ రెండు గంటల పాటు విద్యా బోధన అందించాలన్నారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేస్తున్న నాయకులు

నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి - నిజాంపట్నం

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో సర్వకోల్పోయిన బాధితులకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, నియోజకవర్గ టిడిపి నేత అనగాని శివప్రసాద్ ఆదేశాల మేరకు టిడిపి నాయకులు మంగళవారం నిత్యావసరసరుకులు, దుస్తులు పంపిణీ చేశారు. నిత్యావససరుకులు, దస్తులు అందజేసిన వారిలో జడ్‌పిటిపి నర్రా సుబ్బయ్య, టిడిపి నాయకులు పీత సాయిబాబు, లంకే మీరయ్య, నాయుడు గోపి, వెంకటేశ్వరరావు, గంగరాజు, సునీల్, సుందరరావు, మోహనరావు ఉన్నారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-మార్టూరు

బీసీ కార్పొరేషన్ రుణాల కోసం అర్హులైన వారు ఫిబ్రవరి 5 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ వై. శ్రీనివాసరావు తెలిపారు. 6, 7 తేదీలలో దరఖాస్తుల పరిశీలన ఉంటుందన్నారు. ఎంపిక చేయబడిన అభ్యర్థులకు బ్యాంకు అధికారులతో కలిసి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఇంటర్వ్యూల్లో ఎంపికైన అభ్యర్థులకు ఆయా కేటగిరీల వారీగా యూనిట్లు మంజూరు చేస్తారని తెలిపారు.

హైవేల నిర్మాణాల్లో భూములు కోల్పోయిన

రైతులకు న్యాయం చేస్తాం

కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి

రైతుల దరఖాస్తులు పరిశీలిస్తున్న ఉగ్ర

ప్రజాశక్తి-సిఎస్.పురం

మండలంలో జరుగుతున్న హైవే రోడ్ల నిర్మాణంలో భూములు కోల్పోయి.. నష్టపరిహారం అందని రైతులకు న్యాయం చేస్తామని కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం నష్టపరిహారం అందని రైతులతో సమావేశం నిర్వహించారు. ఏఏ గ్రామాల్లో నష్టపరిహారం అందలేదో అలాంటి రైతుల వద్ద నుండి దరఖాస్తులు స్వీకరించారు. సిఎస్.పురం, డిజి.పేట, రేగులుచెలుక, గుంతచెన్నంపల్లి గ్రామాలతో పాటు మరి కొంతమంది గ్రామాలు రైతులు తమకు నష్ట పరిహారం ఇవ్వకుండానే రోడ్లు నిర్మిస్తున్నారని తెలిపారు. అనంతరం విఆర్ఓ, సర్వేయర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రైతులకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లు కరెక్ట్‌గా ఉన్నట్లయితే ఆలస్యం చేయకుండా వారి పనులు చేసి పెట్టాలన్నారు. కార్యాలయాల చుట్టూ రైతులు తిప్పుకోవద్దని బాధ్యతగా పని చేయకుంటే వేటు తప్పదని హెచ్చరించారు.

హైవే రోడ్ల నిర్మాణ పనులు పరిశీలన

మండలంలో జరుగుతున్న 167బి గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్ల నిర్మాణ పనులను కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పరిశీలించారు. 167బి హైవే రోడ్డు నిర్మాణంలో ఇల్లు కోల్పోతున్న కష్ణం నాయనపల్లి, గణేష్‌నిపల్లి గ్రామాల ప్రజలతో ఆయన మాట్లాడారు. తమకు నష్ట పరిహారం ఇవ్వకుండానే ఇల్లు కొట్టేస్తున్నారని వెంటనే నష్టపోయారని ఇప్పించాలని కోరారు. రాని వారందరికీ కూడా వీలైనంత త్వరలో పరిహారం అందే విధంగా ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ కేశవర్ధన్‌రెడ్డి, తహశీల్దార్ పి.వెంకటేశ్వర్లు, ఎంపిడిఓ రంగ సుబ్బరాయుడు, మండల టిడిపి అధ్యక్షులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, క్లస్టర్ ఇన్‌చార్జ్జి నాగిశెట్టి చిన్నమాలకొండయ్య, మన్నేపల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచారాన్ని నివేదించండి

- సమస్యలకు సత్వర పరిష్కారం
- అధికారులకు కలెక్టర్ వెంకటమురళి ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలకు సత్వర పరిష్కారం చూపడంతో పాటు అందుకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని తనకు నివేదించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. వచ్చే నెలలో డిఆర్‌సి సమావేశం ఉన్న నేపథ్యంలో మంగళ వారం సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకష్ణతో కలిసి అన్ని శాఖల ఉన్నతాధికారులతో ప్రకాశం భవనంలో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. గత నవంబర్‌లో జరిగిన డిఆర్‌సి సమావేశంలో ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై ఈ సందర్భంగా ఆమె ఆరా తీశారు. దీంతో వచ్చే సమావేశానికి అన్ని శాఖల ఉన్నతాధికారులు పూర్తిస్థాయి సమాచారంతో సన్నద్ధం కావాలని ఆదేశించారు. ఇందు కోసం ఇప్పటినుంచే క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్ష సమావేశాలు నిర్వహించి సమగ్ర సమాచారము అందుబాటులో ఉంచాలని దిశా నిర్దేశం చేశారు.సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు, సిపిఓ డి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా కోసం

రూ.3,500 కోట్లతో డిపిఆర్

డిఆర్‌సిలో కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటి నీరు సరఫరా చేయడానికి రూ.3,500 కోట్లతో డిపిఆర్ పంపామని కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన జిల్లా అభివద్ధి సమీక్షా సమావేశంలో బాపట్ల జిల్లా సమగ్రాభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యల గురించి మంత్రులకు వివరించారు. అమతధార పథకం కింద 2.16 లక్షల గహాలకు ట్యాప్ కనెక్షన్లు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రకాశం బ్యారేజీ నుంచి వేమూరు, రేపల్లె, బాపట్ల, చీరాల, పర్చూరు నియోజకవర్గాలలోని 18 మండలాలకు నీరు అందించేలా రూ.1,820 కోట్లతో నివేదించామన్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ నుంచి రెండు మండలాలకు నీరు ఇవ్వడానికి రూ.200 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. త్వరలో నిధులు వచ్చే అవకాశం ఉందన్నారు. బాపట్ల ఏరియా ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా ప్రతిపాదనలు పంపగా మంజూరు ప్రక్రియలో ఉందన్నారు. సమావేశంలో గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్మన్ హెన్ని క్రిష్టినా, జిల్లా ఎస్పీ తుషార్ డూడి, జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, అడిషనల్ ఎస్‌పి టిపి విఠలేశ్వర్,జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్ పాల్గొన్నారు.

ఆక్రమణలు అరికట్టాలి..

బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ

సాగు కాలువల ఆక్రమణలు అరికట్టాలని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు మంత్రిని కోరారు. గుంతలు పూడ్చే కార్య క్రమంలో నాణ్యత లోపించడంతో ప్రజల అవస్థలు పడుతున్నారని మంత్రి దష్టికి తెచ్చారు. సూర్యలంక బీచ్ నిర్వహణ పంచాయతీకి అప్పగించాలి లేదా పర్యాటక శాఖ బాధ్యత తీసుకోవాలని మంత్రిని కోరారు. అడవి గ్రామంలో అటవీ శాఖ భూమి సేకరించి బోట్ షికార్ అవకాశం కల్పించాలన్నారు.బీచ్ లో సౌకర్యాలు ఏర్పాటు చేసి, అభివద్ధికి మరింత చొరవ చూపాలన్నారు.

విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

విద్యుత్ సమస్యలు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సూర్య ఘర్ పథకం కింద 334 యూనిట్లు ఏర్పాటు చేశామన్నారు. అద్దంకి నియోజకవర్గాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నామన్నారు. ఉపాధి హామీ పథకం కింద నిర్మించే తొమ్మిది అడుగుల సిసి రోడ్లతో ఇబ్బందిగా ఉందని, 15 అడుగులకు పెంచి నిర్మించాలన్నారు. బాపట్ల మండలం చింతగుంపల గ్రామంలో 80 స్తంభాలు నూతనంగా వేయాలని ఆదేశించారు.

సాగునీటి కాల్వల మరమ్మతు పనులు చేపట్టాలి

రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

సాగునీటి కాల్వల మరమ్మతు పనులు అత్యవసరంగా చేపట్టాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశించారు. ఇటీవల జరిగిన తనిఖీలలో దస్త్రాలు చూపకుండా పలుమార్లు ఇబ్బందులు పెడుతున్న వ్యక్తులను సస్పెండ్ చేయాలని ఆదేశించారు. రేపల్లె రహదారులపై టైల్స్ ముక్కలు వేసి గుంతల పూడ్చడం ద్వారా ప్రమాదం జరిగి నలుగురికి తీవ్ర గాయాలయ్యాయని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతగా పనిచేయాలని, విధుల పట్ల శ్రద్ధ చూపాలని హెచ్చరించారు.

ఎత్తిపోతల పథకాలను వినియోగంలోకి తేవాలి..

పర్చూరు ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు

పర్చూరు నియోజకవర్గంలో ఎత్తిపోతల పథకాలు నిర్వహణ అధ్వానంగా ఉందని పర్చూరు శాసనసభ్యులు ఏలూరు సాంబశివరావు చెప్పారు. 40 వేల ఎకరాలు ఎత్తిపోతల పథకాలపై ఆధారపడి రైతులు సాగు చేసుకుంటున్నారని, ప్రస్తుతం నష్టాలు చవిచూస్తున్నారని వివరించారు. రైతులను ఆదుకోవాలని అన్నారు.

నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలి..

వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

వివిధ పనులకు సంబంధించిన బిల్లులు నిలిచాయని, నిధుల విడుదలకు మండల స్థాయి అధికారులు పట్టించు కోవడం లేదని వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు మంత్రి దృష్టికి తెచ్చారు. లంక గ్రామాలలో తాడిగిరిపాలెం, పోతుర్లంక ఎత్తిపోతల పథకలు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు

చీరాల ఎమ్మెల్యే ఎం.మాలకొండయ్య

చీరాల నియోజకవర్గం ఎత్తిపోతల పథకాలపై ఆధార పడి ఉందని, మరమ్మత్తు పనులు వేగంగా చేపట్టాలని చీరాల శాసనసభ్యులు ఎం మాల కొండయ్య మంత్రి దష్టికి తెచ్చారు. చేనేతపార్కు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలన్నారు.

మూడో విడతలో నిధులు

బాపట్ల ఎంపి కృష్ణ ప్రసాద్

బాపట్ల వైద్య కళాశాల నిర్మాణానికి మూడో విడతలో నిధులు విడుదల చేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినట్లు బాపట్ల ఎంపీ తెన్నేటి కష్ణ ప్రసాద్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు రుణ సదుపాయం కల్పించాలని అధికారులకు సూచించారు.

మహిళ కడుపులో..

15 కిలోల భారీ కణితి తొలగింపు

కిమ్స్ హాస్పిటల్‌లో అరుదైన ఆపరేషన్

వివరాలు వెల్లడిస్తున్న కిమ్స్ వైద్యులు, ఇన్‌సెట్లో తొలగించిన భారీ కణితి

ప్రజాశక్తి-ఒంగోలు

ప్రకాశం జిల్లా, ఒంగోలులోని కిమ్స్ హాస్పిటల్‌లో ఓ మహిళ కడుపులో ఉన్న 15 కిలోల అతి పెద్ద కణితిని వైద్యులు ఆపరేషన్ ద్వారా తొలగించారు. 40 సంవత్సరాల వయస్సు గల మహిళ వారం రోజుల నుండి పసర వాంతులు, కడుపు నొప్పి మరియు పొట్ట ఉబ్బరంతో బాధ పడుతూ కిమ్స్ హాస్పిటల్ నందు గ్యాస్ట్రో, లాప్రోస్కోపీ సర్జన్ డాక్టర్ కార్తీక్ బాబు, గైనకాలజిస్ట్ డాక్టర్ సుజనిని సంప్రదించారు. ఆమెకి వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు.. ఆమె కడుపులో పెద్ద కణితి ఉందని గుర్తించారు. ఆ కణితి పేగులపై ఒత్తిడి చేయడం వల్ల పసర వాంతులు అవుతున్నాయని నిర్ధారించారు. డాక్టర్ సుజని, డాక్టర్ కార్తీక్‌బాబు, డాక్టర్ ఇమ్రాన్, డాక్టర్ రామకష్ణ, డాక్టర్ అనూషల వైద్యబృందం ఆమెకు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించి.. ఆ కణితిని తొలగించారు. కణితి చాలా క్లిష్టమైన అవయవాలు అయిన అండాశయం, పేగులు, గర్భసంచి మరియు పెద్దనరాలు గట్టిగా ఆనుకొని ఉందని వైద్యులు తెలిపారు. ఇంతటి భారీ పరిమాణం గల కణితిని అండాశయం నుండి తొలగించడం చాలా అరుదు మరియు క్లిష్టతరమని కిమ్స్ హాస్పిటల్స్, ఒంగోలు మెడికల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీహరి రెడ్డి పేర్కొన్నారు. ఇలాంటి అరుదైన వైద్య సేవలు అందించడంలో కిమ్స్ హాస్పిటల్స్ ఎప్పుడూ ముందుంటాయని ఈడి గిరినాయుడు తెలిపారు. సర్జరీని విజయవంతం చేసిన వైద్య బందాన్ని కిమ్స్ సిఒఓ అంకిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.